# సివిల్స్‌లో మనోళ్ల సత్తా

- వెలిశాలకు చెందిన సాయికిరణ్‌కు 27వ ర్యాంకు
- నిరుపేద కుటుంబం నుంచి ప్రతిభ చాటిన యువకుడు
- మొదటి ప్రయత్నంలో కరీంనగర్‌కు చెందిన సహనకు 739వ ర్యాంకు



నందల సాయి కిరణ్

**దేశంలోనే అత్యున్నతమైన సివిల్స్‌లో కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు అభ్యర్థులు మెరిశారు. తాజాగా విడుదల చేసిన యూపీఎస్సీ ఫలితాల్లో వెలిచాలకు చెందిన నందల సాయికిరణ్, కరీంనగర్‌కు చెందిన కొలనుపాక సహన అదరగొట్టారు.**

**- చొప్పదండి/ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 16**

## మెరిసిన 'కిరణం'

సివిల్స్ ఫలితాల్లో రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందల సాయి కిరణ్ 27వ ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన కాంతయ్య – లక్ష్మికి కూతురు స్రవంతి, కొడుకు సాయి కిరణ్ ఉండగా, ఇద్దరూ చిన్నప్పటి నుంచే చదువుల్లో రాణించేవాడు. సాయికిరణ్ గ్రామంలోని సరస్వతీ పబ్లిక్ స్కూల్‌లో 5వ తరగతి పూర్తి చేశాడు. కరీంనగర్‌లోని తేజ హైస్కూల్‌లో 2012లో పదో తరగతి పూర్తి చేశాడు. ఈ క్రమంలో కాంతయ్య మహారాష్ట్రలోని భీవండిలో పవర్ లూమ్స్ కార్మికునిగా పనిచేస్తుండగా క్యాన్సర్ బారిన పడడంతో స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఒకవైపు అనారోగ్యంతో బాధపడుతున్న భర్తను చూసుకుంటూ బీడీలు చుడుతూ వచ్చిన ఆదాయంతో పిల్లలను చదివించుకుంటూ తల్లి లక్ష్మి జీవనం సాగించింది. ఇంటర్ ట్రినిటీ కళాశాలలో చదువగా, బీటెక్ వరంగల్ ఎన్ఐటీలో పూర్తి చేశాడు. ఈ సమయంలోనే కాంతయ్య మరణంతో సాయికిరణ్ కుటుంబం మరింత ఇబ్బందులు పడింది. ఈ క్రమంలో తన లక్ష్యమైన సివిల్స్ కోసం ప్రయత్నం చేయాలా? వద్దా? అన్న ఆలోచనలతో వెనకాముందయ్యాడు. సోదరి స్రవంతి బాసరలో ట్రిపుల్‌ఐటీ పూర్తి చేసి మిషన్ భగీరథలో ఏఈఈగా ఉద్యోగం సాధించింది. ఈ క్రమంలో తన జీవిత లక్ష్యాన్ని ఎలాగైనా చేరుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నా చదువును మాత్రం సాయికిరణ్ అశ్రద్ధ చేయలేదు. ఒడిదొడుకులను ఎదుర్కొంటూనే ఒకవైపు సివిల్స్ ప్రిపేర్ అవుతూ వచ్చాడు. ఆర్థిక అవసరాల కోసం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశాడు. మొదటి ప్రయత్నంలో విఫలమైనా, సవాళ్లను అధిగమిస్తూ మరోసారి ప్రయత్నం చేశాడు. తన సోదరి స్రవంతి ప్రోత్సాహంతో కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకున్నాడు. మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఏకంగా 27వ ర్యాంకు సాధించగా, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. తమ కళాశాలలో చదివిన సాయికిరణ్ ర్యాంకు సాధించడం తమకు, తమ కళాశాలకు గర్వకారణమని చెప్పారు. విద్యార్థులు గొప్ప గొప్ప స్థాయిలో స్థిరపడేలా తీర్చిదిద్దేలా అన్ని రకాల వసతులతో విద్యనందించడమే తమ లక్ష్యమని చెప్పారు.

## మొదటి ప్రయత్నంలో సహన



సహనకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన కొలనుపాక సహన 739వ ర్యాంకు సాధించింది. సహన తండ్రి అనిల్ రిపోర్టర్‌గా పని చేస్తుండగా, తల్లి గృహిణి కాగా, ఆ యువతి కరీంనగర్‌లోని కెన్‌క్రెస్ట్ స్కూల్‌లో టెన్త్ దాకా చదివి 9.8 గ్రేడ్ పొందింది. ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీగాయత్రి కళాశాలలో 979 మార్కులతో పూర్తి చేసింది. అనంతరం అక్కడే జేఎన్టీయూలో బీటెక్ కంప్లీట్ చేసి, ఢిల్లీలోని శ్రీరామ్స్ ఐఏఎస్ అకాడమీలో కోచింగ్ తీసుకున్నది. అనంతరం ప్రిలిమినరీ, మెయిన్స్ ఎగ్జామ్స్‌లో క్వాలిఫై అయి, మళ్లీ ఢిల్లీలో మాక్ ఇంటర్వ్యూలు అటెండ్ చేసింది. మొదటి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు 739వ సాధించింది.

## స్మితా మేడం నాకు ఆదర్శం

మా మమ్మీడాడీ ప్రోత్సహించడం వల్లే నేను యూపీఎస్సీలో ర్యాంకు సాధించా. స్మితా సబర్వాల్ మేడం కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఆమె పనితీరు నచ్చింది. అందుకే ఆమెను ఆదర్శంగా తీసుకున్నా. అప్పటి నుంచి కలెక్టర్ కావాలని డిసైడ్ అయ్యాను. మా పేరెంట్స్ సహకారంతో ప్రిపేర్ అయ్యాను.

**- కొలనుపాక సహన**

# లాటరీ పేరిట టోకరా!

- ఏజెంట్లను నియమించుకొని దందా
- సుమారు ₹90లక్షలు వసూలు
- డబ్బులతో ఉడాయించిన నిర్వాహకులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కరీంనగర్ రాంనగర్, ఏప్రిల్ 16 : ఆ ముగ్గురు లాటరీ పేరిట ఎరవేశారు. ఏజెంట్లను నియమించుకొని మరీ దందా సాగించారు. కరీంనగర్ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోనే ఈ లక్కీ లాటరీని నడిపి.. వందలాది మంది నుంచి దాదాపు ₹90లక్షల దాకా వసూలు చేశారు. కొద్ది రోజుల నుంచి నిర్వాహకుల నుంచి స్పందన లేకపోవడంతో బాధితులు లబోదిబోమన్నారు. మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సైఫొద్దీన్, ఫారూఖ్, ఎండీ అహ్మద్ రెండేళ్లుగా 'ఎస్కే ఫ్రెండ్స్ అండ్ కో' పేరిట కశ్మీర్‌గడ్డలో లక్కీ లాటరీని నిర్వహిస్తున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, వేములవాడ, సుల్తానాబాద్, మంచిర్యాల, తదితర ప్రాంతాల నుంచి 13 మంది వరకు ఏజెంట్లను నియమించుకున్నారు. వీరి ద్వారా దాదాపు 560 మంది సభ్యుల నుంచి నెలకు ₹వెయ్యి చొప్పున సుమారు ₹89 లక్షల 60 వేల దాకా వసూలు చేశారు. లాటరీ ద్వారా ప్రతినెలా కరీంనగర్‌లోని ఓ గెస్ట్ హౌస్‌లో డ్రా తీసి, గెలిచిన 12 మంది కస్టమర్లకు బహుమతులు ఇచ్చేవారు. ఇలా 14 నెలల వరకు డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. 15వ నెల డ్రా తీసినా కూడా అప్పటి నుంచి గెలిచిన వారికి బహుమతులు ఇవ్వడం లేదు. కొత్తగా డ్రా నిర్వహించడం లేదు. అప్పటి నుంచి ఏజెంట్లు, సభ్యులు నిర్వాహకులకు ఫోన్ చేసినా స్పందించడం లేదు. ఈ ముగ్గురు కరీంనగర్‌లోనే కాకుండా మంచిర్యాలలో కూడా లక్కీ లాటరీ పేరిట ఏజెంట్లను, సభ్యులను మోసం చేశారనే బాధితులు ఆరోపిస్తున్నారు. మంగళవారం టూ టౌన్ పోలీసులను ఆశ్రయించి, నిర్వాహకులపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్ కుమార్‌ను సంప్రదించగా, ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేస్తున్నామని చెప్పారు.



మల్లాపూర్: ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

**18న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల**

# రేపటి నుంచే నామినేషన్ల పర్వం

- అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఇప్పటికే డేట్స్ ఫిక్స్ చేసుకున్న అభ్యర్థులు
- కరీంనగర్, పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు
- మొత్తం 33.82 లక్షలకుపైగా ఓటర్లు
- 14,100 మంది పోలింగ్ సిబ్బంది
- 4,050 కేంద్రాల ఏర్పాటు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు

| నామినేషన్ల స్వీకరణ | పరిశీలన 26న | పోలింగ్ మే 13న |
|---|---|---|
| ఈ నెల 18 నుంచి 25 వరకు | ఉపసంహరణ గడువు 29న | ఓట్ల లెక్కింపు, రిజల్ట్ జూన్ 4 |

**పార్లమెంట్ ఎన్నికల్లో కీలకమైన మొదటి అంకం రేపటి నుంచే మొదలు కాబోతున్నది. కేంద్ర ఎన్నికల సంఘం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ మేరకు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్నది. ఆ వెంటే నామినేషన్ల పర్వం ప్రారంభమై వారం పాటు కొనసాగనున్నది. ఈ నెల 25తో స్వీకరణ గడువు ముగియనుండగా, ఆయా పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఇప్పటికే డేట్స్ ఫిక్స్ చేసుకున్నారు. ఇటు ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రచారానికి సంబంధించి ఎలాంటి అనుమతులైనా సువిధ యాప్ ద్వారా మాత్రమే తీసుకోవాల్సి తీసుకోవాలని సూచిస్తున్నారు.**



పెద్దపల్లి: కలెక్టరేట్‌లో భద్రత ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, రామగుండం సీపీ శ్రీనివాస్

కరీంనగర్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / కలెక్టరేట్ : పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం రానుండగా, అందుకు అధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కరీంనగర్, పెద్దపల్లి రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 33,82,724 మంది ఓటర్లు ఉండగా.. 4,050 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. గతంలో మాదిరి కాకుండా ఈసారి ఓటర్లకు అనుకూలంగా ఉండే ప్రాంతాల్లో మాత్రమే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల కోసం 14,100 మంది పోలింగ్ సిబ్బందిని వినియోగించనున్నారు.

## వంద శాతం ఓటింగ్ లక్ష్యం

వందశాతం వోటింగ్ లక్ష్యంగా ఎన్నికల సంఘం కృషి చేస్తున్నది. అందులో భాగంగా 85 ఏండ్లు నిండిన వయోవృద్ధులతోపాటు దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించింది. వీరిలో అర్హులైన వారికి ఫామ్–12 ఫారాలు అందించి, హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తులు కూడా చేయించింది. మే 3 నుంచి వారికి పోస్టల్ బ్యాలెట్ల ద్వారా ఓటింగ్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది.

## లెక్కలు తప్పని సరి

నామినేషన్లు వేసిన నాటి నుంచే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు పరిగణలోకి వస్తాయి. ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆ లెక్కలు కచ్చితంగా చూపాల్సి ఉంటుంది. అభ్యర్థుల ఖర్చులను అంచనా వేసేందుకు ఈసీ ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసింది. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్, ఎంసీసీ బృందాలు ఇప్పటికే రంగంలోకి దిగి తమకు కేటాయించిన విధులు నిర్వర్తిస్తున్నాయి.

## కరీంనగర్ కలెక్టరేట్‌లో

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధి కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో విస్తరించి ఉండగా, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూస్తున్నారు. అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఇతర జిల్లాల్లోని అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసేందుకు ప్రత్యేకాధికారులను నియమించారు. లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్వో)ను కూడా నియమించారు. కరీంనగర్‌కు కే మహేశ్వర్, చొప్పదండి ప్రఫుల్ దేశాయ్, వేములవాడకు ఎస్ రాజేశ్వర్, సిరిసిల్లకు పీ గౌతమి, మానకొండూర్‌కు కే లక్ష్మీకిరణ్, హుజూరాబాద్‌కు ఎస్ రమేశ్, హుస్నాబాద్‌కు వీ రామ్మూర్తి ఏఆర్వోలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటు నోడల్ అధికారులను కూడా నియమించి, 7,600కు పైగా ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగించారు. వీరిలో పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు. ఓపీవోలకు కూడా శిక్షణ ఇస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 17,88,392 మంది ఓటర్లుండగా, దాదాపు 2,200 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పమేలా సత్పతి తన చాంబర్‌లో అభ్యర్థుల నుంచి పత్రాలు స్వీకరించనున్నారు. అభ్యర్థులు కలెక్టరేట్‌లోని ఎస్‌బీఐ పక్కన ఉన్న ప్రవేశ ద్వారం గుండా రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు.**

## పెద్దపల్లి కలెక్టరేట్‌లో..

పెద్దపల్లి లోక్‌సభ సెగ్మెంట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతోపాటు జగిత్యాల జిల్లాలో విస్తరించి ఉండగా, అందుకనుగుణంగా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఇతర జిల్లాల్లోని అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేకాధికారులను నియమించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కూడా నియమించారు. పెద్దపల్లికి ఆర్డీవో గంగయ్య, రామగుండానికి అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మంథనికి ఆర్డీవో హనుమనాయక్, మంచిర్యాలకు ఆర్డీవో రాములు, చెన్నూర్‌కు ఎస్‌డీసీ చంద్రకళ, బెల్లంపల్లికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, ధర్మపురికి అదనపు కలెక్టర్ దివాకర ఏఆర్వోలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. నోడల్ అధికారులను కూడా నియమించి, 6,500 మందికి పైగా ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగించారు. వీరిలో పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు. ఓపీవోలకు కూడా శిక్షణ ఇస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 15,94,332 మంది ఓటర్లుండగా, దాదాపు 1,850 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను పెద్దపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ చాంబర్‌లో అభ్యర్థుల నుంచి పత్రాలు స్వీకరించనున్నారు. అభ్యర్థులు కలెక్టరేట్‌లోని ప్రధాన ద్వారం గుండా రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు.**

# కాంగ్రెస్ ఝూటా పార్టీ

- మోసపూరిత హామీలతో గద్దెనెక్కింది
- ఎంపీ అర్వింద్ చేసింది శూన్యం
- నన్ను ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

మల్లాపూర్/ సారంగాపూర్, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ 420 మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను నిండాముంచి గద్దెనెక్కిందని, అదో బడా ఝూటా పార్టీ అని నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఝూటా కోర్ అని, అసత్య ప్రచారం చేసి గెలిచిండని, ఇప్పుడు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిండని దుయ్యబట్టారు. కాంగ్రెస్, రేవంత్ చెప్పిన అబద్ధాలను ప్రజల ముందు ఎండగట్టాలని, ఓటుతో బుద్ధి చెప్పేలా చైతన్యం కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మల్లాపూర్‌లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. కేఎంఆర్ గార్డెన్స్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సాయంత్రం బీర్‌పూర్‌లో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మండపంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో కలిసి హాజరయ్యారు. ఆయా చోట్ల ఆయన మాట్లాడారు. వైఎస్ హయాంలో కాంగ్రెస్ ఒరిజినల్‌గా ఉండేదని, ఇప్పుడున్నది డూప్లికేట్ అని మండిడ్డారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చేందుకు జీవన్‌రెడ్డి అడ్డువస్తున్నారనే కారణంతో అధిష్టానం జీవన్‌రెడ్డిని ఎన్నికల బరిలో నిలిపిందన్నారు. ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. నిధులు తీసుకురాని అసమర్థుడు ధర్మపురి అర్వింద్ అని, ఈ ఐదేండ్లలో చేసింది శూన్యమని, ప్రజలకు ముఖం చూపించే పరిస్థితి లేదన్నారు. బీజేపీ ప్రజల చెవిలో పూలు పెడితే, కాంగ్రెస్ ప్రజల నెత్తిమీద భస్మాసుర చెయ్యి పెట్టిందని మండిపడ్డారు. నాడు ఎడారిగా ఉన్న తెలంగాణను సీఎం కేసీఆర్ అనేక ప్రాజెక్టులతో సస్యశ్యామలం చేస్తే, సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి మళ్లీ ఎడారి చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ ఆధ్వర్యంలో అమలైన పథకాలు, చేసిన అభివృద్ధి పనులపై పార్టీ నాయకులు ప్రజల్లో చర్చ పెట్టాలని, అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేసే వారికే ఓటు వేయాలని, అప్పుడే ఈ ప్రాంత ప్రజలకు లాభం జరుగుతుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని, మీ కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా నిలుస్తానని, ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.

# ఒకే కుటుంబానికి మూడు పదవులా..?

- మూడోతరం వారికి కూడా ఇంకా ఓటు వేయాలా..
- అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం
- ఈ మట్టితో అనుబంధమున్న వ్యక్తిని నేను
- ఆశీర్వదిస్తే అందుబాటులో ఉండి సేవ చేస్తా
- బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్




మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్, వేదికపై జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని, మార్చి 16: కాంగ్రెస్ పార్టీలో ఒకే కుటుంబం నుంచి మూడు పదవులు కల్పించడం ఎంత వరకు సమంజసమని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. మూడోతరం రిజర్వేషన్ వారసులకు కూడా ఇంకా మనం ఓటు వేయాలా..? అనే విషయాన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ వ్యాపారాలు చేసే వ్యక్తి ప్రజల కష్టాలను ఏం తీరుస్తాడని, ఇక్కడి ప్రజల సమస్యలు పూర్తిగా తెలియని వ్యక్తి వంశీ కృష్ణ అని విమర్శించారు. సింగరేణి కార్మికుడిగా, ఉద్యమనేతగా ఈ ప్రాంతం.. ఈ మట్టితో ఎంతో అనుబంధం తనకు ఉన్నదని, ఓటుతో ఆశీర్వదిస్తే అందుబాటులో ఉండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు. మంథనిలోని ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో మంగళవారం జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాధ్యం కాని అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కేవలం నాలుగు నెలల్లోనే ఆ పార్టీ మోసపూరిత హామీలను ప్రజలు గమనించారని చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేస్తున్నా ఆ సంస్థ మీదనే ఒడ్డెక్కిస్తున్నదని మండిపడ్డారు. గతంలో కాయిలాపడ్డ ఆర్టీసీ సంస్థను కేసీఆర్ సర్కారు అన్ని విధాలుగా ఆదుకున్నదని, కొత్త బస్సులను అందించడంతో పాటు బస్టాండ్‌లు, డిపోలు ఏర్పాటు చేయడం, అధికారులు, సిబ్బందికి జీతాలు పెంచడం వంటివి చేసిందని తెలిపారు. అలాంటి ఆర్టీసీకి కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల మళ్లీ పాత రోజులే వస్తాయన్నారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆగస్టు 15వ తేదీ వరకు రైతు రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ప్రజలను మోసం చేసేలా ప్రకటిస్తోందని దుయ్యబట్టారు. పదేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ సర్కారు పాలన కొనసాగిందని గుర్తు చేశారు. మీ కష్టాలు తెలిసిన వ్యక్తిగా మీ ముందుకు వచ్చానని, తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ నెల 19న తాను నామినేషన్ వేస్తున్నానని, ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు జక్కు రాకేశ్, తగరం సుమలత, రాచకొండ లక్ష్మి, ఎగోలపు శంకర్‌గౌడ్, ఆరెపల్లి కుమార్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ గెలుపు ఖాయం

పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లిలో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలువడం ఖాయం. పెద్దపల్లి ఎంపీ స్థానాన్ని ఒకే కుటుంబానికి రాసిచ్చినట్టుగా కాంగ్రెస్ పార్టీ వారికే కేటాయిస్తున్నది. ఇప్పటికే వారింట్లో రెండు పదువులున్నా మళ్లీ ఎంపీ స్థానాన్ని కూడా కేటాయించింది. ఈశ్వర్‌ను గెలిపించుకోవడం వల్ల బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు కొండంత అండ దొరుతుంది.

**- పుట్ట మధూకర్, పెద్దపల్లి జడ్పీ చైర్మన్**

## ప్రజలే ఆలోచించాలి

పెద్దపల్లి ఎంపీ స్థానంలో గుణవంతుడు.. ధనవంతుడికి పోటీ జరుగుతున్నది. ధనవంతుడు కన్న తల్లిదండ్రులకు కూడా అన్నం పెట్టడు. అదే గుణవంతుడు సమాజం బాగు కోసం పోరాడుతడు. దీన్ని గమనించి ఎవరు కావాలో ప్రజలే ఆలోచించుకోవాలి. గడ్డం వివేక్ కుటుంబం కేవలం అధికారం, పదవుల కోసం మాత్రమే రిజర్వేషన్‌ను వాడుకుంటున్నది. వాళ్లెప్పుడూ ప్రజల కష్టాలను తీర్చలేదు. ఇప్పుడు మళ్లీ వాళ్ల కుటుంబం నుంచి మూడో వారసుడు ఎంపీగా పోటీ చేస్తున్నడు. ఈ ప్రాంతం నుంచి అవగాహన లేని వ్యక్తి కేవలం డబ్బు మాత్రమే ఆశ చూపి గెలువాలని చూస్తున్నడు. ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలి.

**- తగరం శంకర్‌లాల్, బీఆర్ఎస్ నాయకుడు**








